epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక



ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ పోరు 3

సంపుటి : 01 | సంచిక : 22 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 18 డిసెంబర్ 2025 | పేజీలు : 04





# ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ ఎన్నికలు

- **మూడో విడత పోలింగ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు**

**పాలకుర్తి, మన చౌరాస్తా :** మూడో విడత సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ రోజు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాల్లో ఎన్నికల పరిశీలకులు రవి కిరణ్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ భాషా షేక్ పోలింగ్ ను పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అటు పోలింగ్‌కు ఓటర్లు బారులు తీరారు. కేంద్రాల వద్ద గంటల తరబడి వరుసలో ఉండి అభ్యర్థులకు ఓటేశారు.









# ఓటేసిన బబ్బూరి దంపతులు

దేవరుప్పుల, మన చౌరాస్తా : మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం ఉదయం జనగామ జిల్లా బీఆర్ ఎస్ నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ తన స్వంత గ్రామం అయిన దేవరుప్పుల మండలం పెద్దమాదుర్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆయన క్యూలైన్లో నిలబడి ఓటు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు.



**ఓటు హక్కును వినియోగించుకున్న డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతీ, టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్**

# రసులాబాద్ సర్పంచ్‌గా అనూష స్వామి



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం రసలాబాద్ సర్పంచ్ గా పచ్చిమట్ల అనూష స్వామి విజయం సాధించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి అనూష తమ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన శ్రీకాంత్ పై 46 ఓట్ల తేడాతో గెలిపించారు. ఇంతకుముందు రసులాబాద్ గ్రామ సర్పంచ్ గా స్వామి చేసిన సేవలు తిరిగి తమను గెలిపించారని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారు తెలిపారు. దీనితో బిఆర్ఎస్ అనుచరులు గ్రామంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. తమకు ఓటు వేసిన గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# లెనిన్ నగర్ సర్పంచ్‌గా పరశురాములు



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండలం బేరి నగర్ సర్పంచ్ గా దాసరి పరుశురాం విజయం సాధించారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి దాసరి పరశురాములు తమ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సనాది భాస్కర్ పై 36 ఓట్ల తేడాతో గెలుపొందారు. దీంతో సర్పంచ్ అనుచరులు గ్రామంలో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. తమకు ఓటు వేసి గెలిపించిన గ్రామ ప్రజలకు తెలిపారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.



# ప్రజా వైద్యుడికి ఘన నివాళి

- **ఆయన ఆశయాలే నా మార్గం**
- **డాక్టర్ తిప్పని సుధాకర్**

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ ప్రజా వైద్యుడు స్వర్గీయ అప్పని సుధాకర్ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించడమే తన జీవిత లక్ష్యమని ఆయన మేనల్లుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ తిప్పని సుధాకర్ స్పష్టం చేశారు.

## 25వ వర్ధంతి సందర్భంగా..

బుధవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని సాయినగర్ బస్టాండ్ కూడలిలో స్వర్గీయ అప్పని సుధాకర్ 25వ వర్ధంతి సందర్భంగా స్మరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిప్పని సుధాకర్ సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

## ప్రజల హృదయాల్లో నిలిచిన 'ప్రజా వైద్యుడు'

ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ తిప్పని సుధాకర్, స్వర్గీయ అప్పని సుధాకర్ పేదగొప్ప తేడా లేకుండా అందరికీ వైద్య సేవలు అందించి ప్రజల మనసుల్లో 'ప్రజా వైద్యుడు'గా చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తు చేశారు. వైద్య వృత్తిని సేవగా భావించి, అనేక సంవత్సరాల పాటు ఈ ప్రాంత ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

## సేవా మార్గంలో సాగుతా..

తన మేనమామ చూపిన సేవా మార్గంలోనే నడుచుకుంటూ, భీమదేవరపల్లి మండలంతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తానని డాక్టర్ తిప్పని సుధాకర్ భరోసా ఇచ్చారు. ప్రజల ఆరోగ్యమే తన ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు.

## కుటుంబ సభ్యుల స్మరణలు

ఈ నివాళి కార్యక్రమంలో స్వర్గీయ అప్పని సుధాకర్ సతీమణి రమాదేవి, ఆయన సోదరుడు కొత్తపల్లి మాజీ సర్పంచ్ ఉమాపతి పాల్గొని, సుధాకర్తో తమకున్న అనుబంధాన్ని, ఆయన సేవా తత్వాన్ని భావోద్వేగంగా గుర్తు చేసుకున్నారు.
ఈ కార్యక్రమంలో ముల్కనూరు నర్సింగ్ హోమ్ వైద్యులు, స్థానిక నాయకులు, భీమదేవరపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ సుధాకర్కు శ్రద్ధాంజలి ఘటించారు.





# ప్రశాంతంగా మూడవ విడత పోలింగ్

- **పోలింగ్ కేంద్రాల పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మన చౌరాస్తా :** జిల్లాలో మూడవ విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల మూడవ విడత పోలింగ్ నేపథ్యంలో బుధవారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం నర్సంపేట మండలం: లక్నేపల్లి ఇటుకాలపల్లి, పోలింగ్ కేంద్రాలు, ఖనాపూర్ మండలం: ఖనాపూర్, రాగంపేట పోలింగ్ కేంద్రాలు, చెన్నారావుపేట మండలం: ఉప్పరపల్లి, తిమ్మరాయనిపహాడ్ పోలింగ్ కేంద్రాలు, నెక్కొండ మండలం: రెడ్లవాడ, ఆలంఖానిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలతో పాటు పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బందిపై నున్న ప్రధాన బాధ్యత అని అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత ఔచిత్యం కలదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఎన్నికల సూచనల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి, రెండవ విడతలలో హరిత పోలింగ్ కేంద్రాలలో మిగతా పోలింగ్ కేంద్రాల కంటే సుమారు 3 శాతం పోలింగ్ పెరిగిందని, గ్రీన్ పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వల్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతోందని, తద్వారా పోలింగ్ శాతం మరింత పెరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. మూడవ విడతలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని, నాలుగు మండలాల్లోని 110 సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 282 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలకు గాను 28 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, ఇతర పోలింగ్ స్టేషన్లలో వీడియో గ్రాఫర్లను ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత లో పోలింగ్ 86 శాతం, రెండో విడతలో పోలింగ్ 88 శాతం నమోదు కావడంతో, పోలింగ్ శాతం క్రమంగా పెరుగుతున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. నాలుగు మండలాల్లో మొత్తం 102 గ్రామపంచాయతీలు, 809 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ నిర్వహణ జరుగుతోందని అన్నారు. 7 గ్రామపంచాయతీలు, 137 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని వెల్లడించారు. పోలింగ్ నిర్వహణకు సుమారు 4 వేల మంది సిబ్బందిని నియమించామని, ఇందులో 1500 మంది పోలీస్ సిబ్బంది, 2400 మంది పోలింగ్ అధికారులు, మైక్రో అబ్సర్వర్ల ,ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుండి కౌటింగ్ ప్రారంభమవుతుందని, ముందుగా వార్డుల కౌంటింగ్ , తర్వాత గ్రామపంచాయతీ లో సర్పంచ్ కౌంటింగ్ జరుగుతుందని వారన్నారు. మేజర్ గ్రామపంచాయతీలలో త్వరగా ఫలితాలు వచ్చేలా ఎక్కువ టేబుల్స్ ఏర్పాటు చేసి ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆర్వోలకు ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. మూడవ విడతలో 809 వార్డ్ స్థానాలను కౌంటింగ్ ఫలితాలు త్వరితంగా ఇచ్చుటకు ప్రణాళికలు సిద్ధం చేశామని.. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ కౌంటింగ్ జరుగుటకు అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, ఆర్డీఓలు ఉమారాణి, సుమా, నోడల్ అధికారులు, ఎంపిడీవోలు, తహశీల్దార్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తనాళాల సమస్యలు నిర్లక్ష్యం చేస్తే

# ప్రాణాలకే ముప్పు

- **ప్రముఖ డాక్టర్ నరేంద్రనాథ్ మేడ**
- **హన్మకొండలో నిపుణ వైద్య సేవలు అందుబాటు**

**హనుమకొండ, మన చౌరాస్తా :** రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెడ భాగంలో రక్తనాళం మూసుకుపోవడం వల్ల అకస్మాత్తుగా మూర్ఛలు రావడం, శరీరంలోని ప్రధాన రక్తనాళంలో ఉబ్బరం ఏర్పడటం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తడం, నడుస్తున్నప్పుడు తొడలు లేదా పిక్కలలో నొప్పులు రావడం వంటి లక్షణాలు రక్తనాళ వ్యాధులకు ప్రధాన సంకేతాలుగా ఉంటాయని వారు పేర్కొన్నారు. అదేవిధంగా చేతుల్లో నొప్పులు రావడం, వేళ్ల రంగు మారిపోవడం, కాళ్లలో రక్తప్రసరణ తగ్గిపోవడం వల్ల రక్తనాళాలు మూసుకుపోవడం, ఉబ్బిన రక్తనాళాలు బయటకు స్పష్టంగా కనిపించడం, కాళ్లపై నలుపులు పడటం వంటి సమస్యలు కొనసాగితే అవయవాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉందని వివరించారు. కొందరిలో కాళ్లు లేదా మడమలు అధికంగా వాపు రావడం, చిన్న గాయాలు కూడా మానకుండా పుండ్లుగా మారడం వల్ల నడవలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ తరహా సమస్యలకు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోతే చికిత్స మరింత క్లిష్టమవుతుందని, అయితే ప్రారంభ దశలోనే గుర్తిస్తే శస్త్రచికిత్స అవసరం లేకుండానే సమస్యలను నియంత్రించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పదిహేను సంవత్సరాల అపార అనుభవం కలిగిన నరేంద్రనాథ్ మేడ వైద్య బృందం ఆధ్వర్యంలో డాక్టర్ ప్రియ భారతి రక్తనాళాలకు సంబంధించిన



వైద్య సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ప్రతి నెల మొదటి బుధవారం..

ప్రతి నెల మొదటి బుధవారం హన్మకొండలోని బాల సముద్రం రోడ్డులో ఉన్న శ్రేష్ఠ డయాగ్నస్టిక్ కేంద్రంలో ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. రక్తనాళాల సమస్యలతో బాధపడుతున్న వారు, ముఖ్యంగా మధుమేహంతో బాధపడేవారు, వృద్ధులు, దీర్ఘకాలిక నొప్పులతో ఇబ్బంది పడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రక్తనాళాల ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని నిపుణులు సూచించారు.

# వెయిట్ లిఫ్టింగ్‌లో రామప్ప విద్యార్థికి కాంస్య పతకం

**హనుమకొండ, మన చౌరాస్తా :** హనుమకొండలో గల రామప్ప జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్న మాటేటి వంశీ, గత నెలలో జరిగిన తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 11వ తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 25 26 అండర్ 19 సీనియర్ విభాగంలో 65 కేజీల కేటగిరిలోతృతీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో హైదరాబాదులోని జింఖానా స్టేడియం లో నిర్వహించిన స్టేట్ మీట్ కి అర్హత సాధించి రాష్ట్రస్థాయి పోటీలలో కూడా తృతీయ స్థానం పొంది కాంస్య పథకాన్ని సాధించడం జరిగిందని కళాశాల డైరెక్టర్ కర్ణాకర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.రామప్ప కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రోత్సాహం ఉంటుందని దీని కారణంగానే ప్రతి సంవత్సరం చాలామంది విద్యార్థులు రాష్ట్ర మరియు జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటూ



ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని గుర్తుచేస్తూ ఈ సంవత్సరంలో 28 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో వివిధ క్రీడలలో పాల్గొన్నారని సగర్వంగా తెలియజేశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వంశీని అభినందిస్తూ షీల్డ్ ,శాలువాతో సత్కరించారు . ఈ కార్యక్రమంలోఫిజికల్ కోచ్ కమల్, అకాడమిక్ కోఆర్డినేటర్ వినోద్, జోనల్ మేనేజర్ పూర్ణచందర్, వైస్ ప్రిన్సిపల్తి తిరుపతి అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన

# వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం జరుగుతున్న గ్రామపంచాయతీ మూడవ విడత ఎన్నికలకు సంబంధించి పలు గ్రామపంచాయతీలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ జనగామ జిల్లా లోని, పాలకుర్తి, కొడకండ్ల,దేవరుప్పుల మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాటతో పాటు ఎన్నికలు జరుగుతున్న తీరుతెన్నులపై పోలీసు కమిషనర్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిషనర్ అధికారులకు పలు సూచన సలహాలు అందజేశారు. సీపీ వెంట వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్, అదనపు డిసిపి రవి,ఏసీపీ నర్సయ్యతో పాటు స్థానిక ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐలు పాల్గొన్నారు.




# ఆకట్టుకుంటున్న కాంత

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం కాంత . సెల్వమణి సెల్వరాజ్ డైరెక్షన్‌లో పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 14న విడుదలైంది. తమిళంలో కాంత చిత్రానికి సాలిడ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద తన ప్రభావాన్ని చూపించడంలో విఫలమైంది. తెలుగులో మాత్రం ఈ చిత్రాన్ని బోరింగ్‌గా ఫీలయ్యారు. ఈ మూవీ ఓటీటీలో మంచి రెస్పాన్స్ రాబట్టుకుంటోంది. ఇటీవలే పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం నెట్‌ఫ్లిక్స్‌లో పలు ప్రధాన భాషల్లో విడుదలైంది కాంత. తాజా అప్‌డేట్ ప్రకారం కాంత చిత్రానికి ఓపెనింగ్ వీకెండ్‌లో 1.1 మిలియన్ వ్యూస్‌తో అద్భుతమైన స్పందన వచ్చింది. ఓటీటీలో విడుదలైన ఫస్ట్ వీకెండ్‌లో 1 మిలియన్ వ్యూస్ అధిగమించిన 17వ కోలీవుడ్ సినిమాగా కూడా నిలిచింది కాంత. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. సముద్రఖని, రానా కీలక పాత్రల్లో నటించారు. కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరించాడు.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**